# ట్రాన్స్‌ఫర్

- బత్తుల గణేష్‌బాబు



**"భార్యా భర్తలిద్దరూ వేర్వేరు ఆఫీసుల్లో పని చేస్తున్నప్పుడు, భర్తకు తప్పనిసరిగా దూర ప్రాంతానికి ట్రాన్స్‌ఫరై, భార్య ఇక్కడే వుండి పోవడం లాంటి సమస్య వస్తుంది మరి" ఎదురుగా కూర్చున్న శ్రీవిద్యనుద్దేశించి అన్నాడు మేనేజర్ శివరామ్.**

"ఆయన వెళ్ళింది మొన్న మొన్ననేగా సార్! అయినా ఆ వూరుకు నా ట్రాన్స్‌ఫర్ కన్ఫర్మ్ అయింది కదా! ఈ కొద్ది రోజులు ఓపిక పట్టడమే సమస్యగా ఫీలయితే ఇక ప్రతిదీ సమస్యే సార్!" మనిషికి కోతి ఒక్కటే కాదు, కుక్క కూడా దగ్గరి చుట్టమే అన్నట్టు ఎప్పుడూ మొరుగుతూ వుండే మేనేజర్ సానుభూతిగా మాట్లాడుతున్నాడేమిటబ్బా! అని ఆలోచిస్తూ అంది శ్రీవిద్య.

"కాని ఇప్పుడు నీకంటే పదేళ్ళ సీనియర్ ఒకాయన అదే వూరి కోసం ట్రై చేస్తున్నాడు. అలాంటి సీనియర్ల అవసరం చాలా వుంది. అందుచేత నువ్వు ఇక్కడే వుండిపోవలసి వుంటుంది. ఇప్పుడు నీకిది సమస్య కదా?" అని ఆమె ముఖంలో ఫీలింగ్స్ ఎలా మారుతున్నాయో ఓ క్షణం పరిశీలించి "నీకి ట్రాన్స్‌ఫర్ చాలా అవసరమనుకుంటా!" అడిగాడు.

"ఆయనక్కడ, నేనిక్కడా అయితే ఇంటి అద్దెతో సహా అన్ని ఖర్చులూ డబల్ సార్. ఎంత సంపాదిస్తున్నా ఆయనకు తిండి సదుపాయమే కుదరదు".

"పైగా అన్నీ వుండీ ఒంటరి జీవితాలయిపోతాయి ఇద్దరివీ. నా ఇన్‌ఫ్లుయెన్స్ ఉపయోగించి దీన్ని నీకు అనుకూలంగా మార్చగలను. కాని అందుకు మాత్రం నువ్వు ఒక పని చేయాలి".

"ఏమిటి సార్?"

"నీ భర్త దగ్గరకు వెళ్ళడం కోసం ఈ రాత్రికి నన్ను నీ భర్తగా భావించి ఆదరించాలి. కాదు ఆదరించి తీరాలి".

అతడి మాటలకు శ్రీవిద్య మొహం కోపంతో, అవమానంతో ఎర్రబడింది.

"ఫర్వాలేదు. సాయంత్రం ఆఫీసు అయిపోయేలోగా నీ నిర్ణయం చెప్పు చాలు. రేపటి వరకూ ఆగితే ఇక్కడే వుండిపోతున్నావన్న మాట. ఒకవేళ మేనేజ్‌మెంట్ నీకనుకూలంగా వున్నా దాన్ని ప్రతికూలంగా మార్చగలను. అంటే, ప్రస్తుతం నీ అవసరం పూర్తిగా నా చేతిలో వుదన్నమాట" అన్నాడు క్రూరంగా నవ్వుతూ.

లేచి మౌనంగా ఆ గది లోంచి బయటకు వచ్చేసింది శ్రీవిద్య.

ఆమె తప్పకుండా ఒప్పుకుంటుందనే అతని ప్రగాఢ విశ్వాసం. ఈ కాలంలో శీలం, నిజాయితీల కంటే తమ అవసరానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారన్నది అతగాడి ప్రగాఢ విశ్వాసం.

ఇంకో పదిహేను నిమిషాలకు ఆఫీసు టైమ్ అయిపోతుందనగా శ్రీవిద్య మేనేజర్ శివరామ్ గదిలోకి వచ్చి–

"రాత్రి తొమ్మిదిన్నర, పదింటికి రండి. మా ఇల్లు తెలుసుగా" అని వెళ్ళిపోయింది అతని నమ్మకాన్ని బలపరుస్తూ. ఆ మాట కోసమే ఎదురు చూస్తోన్న శివరామ్ ఆఫీసు బోయ్‌ని పిలిచి తన గదికి తాళం వేసేయమని చెప్పి ఆదరా బాదరా ఇంటికి వెళ్ళిపోయాడు.

*** *** ***

సమయం రాత్రి పది గంటలు. శ్రీవిద్య వాళ్ళింటి ముందున్నాడు శివరామ్. ఇంతకు ముందు శ్రీవిద్య ఇచ్చిన ఓ పార్టీకి హాజరవడం చేత ఆ ఇల్లు అతనికి బాగా తెలుసు. కాలింగ్ బెల్ నొక్కాడు. లోపల అడుగుల చప్పుడు. అంతలో ఇంట్లో లైట్లన్నీ ఆరిపోయాయి.

తలుపు తెరుచుకోగానే "వెల్‌కం, మీకోసమే చూస్తున్నాను" తీయగా విన్పించిందో కంఠం. రోజూ ఆఫీసులో వినే దానికంటే మధురంగా, ఎంతో మత్తుగా వుందా కంఠం.

"ఒకేసారి ఇల్లంతా చీకటైపోయిందేమిటి?" అడిగాడు.

"మీరొచ్చారు, ఫ్యూజ్ మాడిపోయింది. ఫ్యూజ్ తీగ ఎక్కడ వుందో మరి?"

"అయినా మనకిప్పుడు కరెంట్‌తో పనేముంది?" అన్నాడు ఆమెకు సమీపంగా చేరుతూ.

*** *** ***

రాత్రి సమ్పందించిన సుఖాన్ని మర్చిపోలేకపోతున్నా. నీవిలా ఎస్ అంటావని ముందే తెలిసుంటే నీకోసం ఎప్పుడో ట్రైచేసి వుండేవాడిని" అని అన్నాడు ఆమెకు ట్రాన్స్‌ఫర్ కాగితాలు అందిస్తూ–

"ఇవి నిన్ననే వచ్చాయి. కానీ చీకట్లో బాణం వేశాను. నా లక్ కొద్దీ సూటిగా తగిలింది" అన్నాడు. ఆ మాటల్లో తన తెలివి తేటలతో ఒక అందమైన సంసార స్త్రీని పొందాననే గర్వం తొంగి చూస్తోంది.

"ఆ చీకట్లో మీరు ఘోరంగా దెబ్బ తిన్నారు. నిన్న రాత్రి నేను మనాఫీసులో పనిచేస్తున్న శశికళ ఇంట్లో వున్నాను" అంది.

"అలాగా! నీ అందం నా పరమయ్యాక కూడా దాన్ని నువ్వు అంగీకరించడం లేదన్నమాట!" అన్నాడు వ్యంగ్యంగా.

"నా ఒక్కదాని మాటనే నమ్మరని తెలుసు. నాకు ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ వచ్చాయన్న విషయం నాకు మీరు చెప్పక ముందే తెలుసు. నీలాంటి గోముఖ వ్యాఘ్రానికి ఓ గుణపాఠం చెప్పాలని నేనూ ఒక ఎత్తు వేశాను. తెలివి నీ ఒక్కడి సొత్తే ననుకోకు. లోగడ నీ చరిత్ర గురించి నా చెవిన బడింది. నిన్న నీవు అడిగాక నీ నిజస్వరూపం తెలిసింది. ఆర్డర్ వచ్చిందన్న విషయం తెలుసు కాబట్టే ఆఫీసులో మన స్టాఫందర్నీ పిలిచి శశికళా వాళ్ళింట్లో నిన్న సాయంత్రం టీపార్టీ ఇచ్చాను. మా ఇల్లు ఇరుకని అందర్నీ అక్కడికే రమ్మనమని చెప్పాను" అంది.

ఇంతలో క్లర్క్ రాఘవ ఫైల్‌తో లోపలికొచ్చి–

"రాత్రి ఈవిడ గారు స్వీట్లూ, హాట్లు వెరయిటీలన్నీ మాముందుంచి, మీరొచ్చాక పార్టీ మొదలు పెడతామని పదయ్యే వరకూ మమ్మల్ని తిననివ్వలేదు సార్" అన్నాడు నవ్వుతూ. దాంతో శివరామ్ ముఖం మాడిపోయింది.

అతను ఫైల్‌పై సంతకం చేయించుకుని వెళ్ళిపోగానే–

"మరి మీ ఇంట్లో వున్నదెవరు?" అడిగాడు అయోమయంగా.

"మా శశికళ మొగుడికి మీలాంటి ఫ్రెండ్ వల్ల ఆమె దొరికింది. మీరు రాగానే మెయిన్ ఆఫ్ చేయమన్నాం తనని గుర్తు పట్టకుండా. ఆమె ఈ ప్రాంతానికి కొత్తట! ఆవిడకు ఎయిడ్స్ వుందని మునుపు ఆవిడున్న వూళ్ళో ప్రచారం జరగ్గానే ఇక్కడకొచ్చిందట! మీరు రాత్రి ఆవిడ్ని భర్తలా ఆదరించారు. ఆవిడ ఎలాంటిదో మీకు భవిష్యత్తును బట్టి తెలుస్తుంది లెండి" అంటూ గదిలోంచి బయటకు వచ్చేసింది శ్రీవిద్య ట్రాన్స్‌ఫర్ కాగితాలతో.